# 2020, మార్చి 8వ తేదీన తెలంగాణ రాష్ట్ర శాసనసభకు 2020-21 సంవత్సరం బడ్జెట్ ను సమర్పిస్తూ గౌరవనీయులైన ఆర్థికమంత్రి శ్రీ తన్నీరు హరీష్ రావు గారి ప్రసంగం.

గౌరవనీయ అధ్యక్షా....

భారత దేశ చరిత్రలో తెలంగాణ ఉద్యమం నూతన అధ్యాయాన్ని సృష్టించింది. అహింసా మార్గంలో శాంతియుత పంథాలో సాగిన ఉద్యమం ఫలించి తెలంగాణ రాష్ట్రం అవతరించింది. స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన ఉద్యమ నాయకుడు, దార్శనిక ముఖ్యమంత్రి గౌరవ శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం ప్రగతిశీల రాష్ట్రంగా రూపుదిద్దుకున్నది. అన్ని వర్గాల సంక్షేమం అన్ని రంగాల అభివృద్ధి లక్ష్యంగా పూర్తి వాస్తవిక దృక్పథంతో 2020-21 వార్షిక బడ్జెట్ ను రూపొందించడం జరిగింది. బడ్జెట్ ప్రతిపాదనలను ఈ గౌరవ సభలో ప్రవేశపెట్టే అవకాశం నాకు లభించినందుకు ఎంతో సంతోషిస్తున్నాను. బడ్జెట్ అంటే కేవలం కాగితాల మీద వేసుకునే అంకెల వరుస కాదు. బడ్జెట్ అంటే సామాజిక విలువల స్వరూపం. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి

పట్ల గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారికున్న సమగ్ర దృష్టిని, శ్రద్ధాసక్తులను ఈ బడ్జెట్ ప్రతిబింబిస్తుంది.

ఆర్థిక మాంద్యం - దాని ప్రభావం:

2. భారతదేశ ఆర్థిక వృద్ధి రేటు గత ఏడాదిన్నర నుంచి తగ్గుతూ వస్తున్నది. దీని వల్ల కేంద్ర ఆదాయ వనరులు తగ్గడంతో రాష్ట్రాలకు వచ్చే పన్నుల వాటాలోను, గ్రాంట్లలోను కోత పడింది. ఆర్థిక మాంద్యం యొక్క ప్రభావం రాష్ట్ర పన్నులు, పన్నేతర ఆదాయంపై పడింది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటా, బడ్జెట్ లో వేసుకున్న అంచనాల కంటే 3,731 కోట్ల రూపాయలు తగ్గింది. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన ఐ.జి.ఎస్.టి.లో కాని, జి.ఎస్.టి పరిహారంలో కాని నిధులు సకాలంలో రావడం లేదు. వచ్చే నిధులు కూడా అరకొరగా కేంద్రం విడుదల చేస్తున్నది. ఈ కారణాలన్నింటి వల్ల రాష్ట్ర రెవెన్యూ వృద్ధి రేటు 2018-19 లో 16.1 శాతం ఉంటే, అది 2019-20 ఫిబ్రవరి చివరి నాటికి 6.3 శాతానికి తగ్గింది.

3. 15వ ఆర్థిక సంఘం మధ్యంతర నివేదిక ప్రకారం తెలంగాణకు వచ్చే పన్నుల వాటా 2.437 శాతం నుంచి 2.133 శాతానికి తగ్గింది. దీని వల్ల 2020-21 ఆర్థిక సంవత్సరంలో మన రాష్టానికి రావాల్సిన నిధుల్లో 2,384 కోట్ల రూపాయలు తగ్గుతాయి. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో, సరైన వ్యూహాలను రూపొందించి, అభివృద్ధి దిశగా పురోగమించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది.

4. సెప్టెంబర్ నెలలో ప్రవేశపెట్టిన పూర్తి 2019-20 బడ్జెట్ లో అంచనాల మేరకు, ఈ మార్చి నెలాఖరు వరకు 1,36,000 కోట్ల రూపాయల ఖర్చు జరుగుతుంది. కేంద్రం నుంచి పన్నుల వాటా, గ్రాంట్లలో కోత పడినప్పటికీ ఆ లోటును స్వీయ ఆదాయ వృద్ధి ద్వారా పూడ్చుకోగలిగాము. బడ్జెట్ అంచనాల మేరకు ఖర్చు చేసుకోగలుగుతున్నాము.

అధ్యక్షా...

5. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గౌరవ సభకు తెలియజేస్తున్నాను.

6. రాష్ట్ర GSDP, 2019-20 లో, 9,69,604 కోట్ల రూపాయలు (ప్రస్తుత ధరల్లో) ఉంటుందని అంచనా. రాష్ట్ర GSDP వృద్ధి రేటు 2018-19 లో 14.3 శాతం ఉంటే, దేశంలో నెలకొన్న ఆర్థిక మాంద్యం ప్రభావం వల్ల 2019-20 నాటికి 12.6 శాతంకు తగ్గింది. అదే సమయంలో దేశ వృద్ధి రేటు 11.2 శాతం నుండి 7.5 శాతానికి తగ్గింది. దేశం మొత్తం తీవ్రమైన ఆర్థికమాంద్యం ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్రం రెండంకెల వృద్ధి రేటును సాధించింది. రాష్ట్ర అభివృద్ధికి, ప్రభుత్వం ముందు చూపుతో తీసుకున్న చర్యల వల్ల మాత్రమే ఇది సాధ్యమయింది.

7. వ్యవసాయం దాని అనుబంధ రంగాల పునరుత్తేజానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగా వచ్చిన గొప్ప మార్పు, గత ఆర్థిక సంవత్సరంలో నమోదైన గణాంకాల్లో స్పష్టంగా కనిపిస్తున్నది. రాష్ట్రంలో పంటల ఉత్పత్తిలో 23.7 శాతం, పాడి పశువుల (live stock) రంగంలో 17.3 శాతం, చేపల పెంపకంలో 8.1 శాతం వృద్ధిని సాధించడం జరిగింది. రైతు బంధు, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం, గొర్రెలు, బర్రెల పంపిణీ, చెరువుల్లో చేపల పెంపకం వంటి పథకాలు అటు రైతుల సంక్షేమానికి,

ఇటు రాష్ట్ర ఆర్థిక రంగ అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. సేవారంగంలో 2019-20 లో 14.1 శాతం వృద్ధి రేటు నమోదు అయింది.

తలసరి ఆదాయం:

8. మన రాష్ట్ర తలసరి ఆదాయం మన దేశ తలసరి ఆదాయం కంటే చాలా ఎక్కువ. 2019-20 నాటికి తెలంగాణ తలసరి ఆదాయం 2,28,216 రూపాయలు ఉండగా, దేశ తలసరి ఆదాయం 1,35,050 రూపాయలు. దేశ తలసరి ఆదాయం కన్నా తెలంగాణ తలసరి ఆదాయం 93,166 రూపాయలు ఎక్కువ కావడం మన ప్రగతికి స్పష్టమైన సంకేతమని తెలియచేస్తున్నాను.

వ్యవసాయం:

9. రాష్ట్రంలో అధిక శాతం ప్రజలు ఆధారపడి జీవనం సాగిస్తున్న వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరచడంలో తెలంగాణ ప్రభుత్వం గొప్ప ఫలితాలను సాధించింది. సమైక్య రాష్ట్రంలో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన వ్యవసాయానికి ప్రభుత్వం నూతన జవసత్వాలు కల్పించింది. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సమగ్ర

వ్యవసాయాభివృద్ధి విధానం యావత్ దేశానికి ఆదర్శంగా నిలవడం ఈ రాష్ట్ర పౌరులుగా మనందరికీ గర్వకారణం.

రైతు బంధు:

10. పంట సమయంలో రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతుబంధు పథకం వల్ల రైతాంగానికి ఎంతో ఊరట కలుగుతున్నది. రైతు బంధు పథకం ద్వారా కలుగుతున్న సత్ఫలితాలను గమనించిన అనేక ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాష్ట్రాల్లో రైతు బంధు తరహా పథకాలను ప్రవేశపెట్టాయి. కేంద్రం కూడా ఈ పథకం ప్రేరణతో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ని (PM-KISAN) రూపొందించింది. మొదట్లో ఎకరానికి 4 వేల రూపాయల చొప్పున, రెండు పంటలకు కలిపి ఏడాదికి 8వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం రైతులకు అందించింది. గత ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఈ రైతు బంధు సాయాన్ని ఎకరానికి ఏడాదికి 10 వేల రూపాయలకు పెంచి అందిస్తున్నది. రైతుబంధు ద్వారా 2018-19 సంవత్సరం వానాకాలంలో

5,235 కోట్ల రూపాయలను, యాసంగిలో 5,244 కోట్ల రూపాయలను ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా అందించింది.

11. 2019-20 లో ఎకరానికి పది వేల చొప్పున 12 వేల కోట్ల రూపాయలను బడ్జెట్ లో కేటాయించి, రైతులకు పంపిణీ చేయడం జరుగుతున్నది. కొత్తగా పాస్ పుస్తకాలు మంజూరు కావడం వల్ల రైతు బంధు లబ్ధిదారుల సంఖ్య వచ్చే ఏడాది పెరుగుతుంది. పెరిగిన లబ్దిదారుల సంఖ్యకు అనుగుణంగా బడ్జెట్ లో రెండువేల కోట్ల రూపాయలను అదనంగా ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది. ఈ బడ్జెట్ లో రైతు బంధు పథకం కోసం రూ.14,000 కోట్లు ప్రతిపాదించడమైనది.

రైతు బీమా:

12. రాష్ట్రంలో ఏ రైతు ఏ కారణంతో మరణించినా ఆ కుటుంబానికి వెనువెంటనే ఐదు లక్షల రూపాయల బీమా మొత్తం అందే విధంగా ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని అమలు చేస్తున్నది. 18 సంవత్సరాల వయసు నుండి 60 ఏళ్ల వయసు ఉన్న ప్రతీ రైతుకు బీమా సదుపాయాన్ని వర్తింప చేస్తున్నది. రైతుల మీద ఒక్క పైసా కూడా భారం

వేయకుండా, ప్రతీ  రైతు పేరిట 2,271.50 రూపాయల ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే ఎల్ఐసి సంస్థకు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నది. రైతు మరణం సంభవించిన పది రోజుల్లోపే వారి కుటుంబ సభ్యులకు 5 లక్షల రూపాయల బీమా మొత్తం  అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. రైతు బీమా కోసం ఈ బడ్జెట్ లో 1,141 కోట్ల రూపాయలను ప్రతిపాదించడమైనది.

రైతు రుణ మాఫీ:

13.  ఎన్నికల మ్యానిఫెస్టో లక్ష్యం కేవలం బ్యాలెట్ బాక్స్ లు మాత్రమే కాకూడదు, ప్రజల బ్రతుకు నిలబెట్టడం కావాలి.  ఇది మన గౌరవ ముఖ్యమంత్రి  కేసీఆర్ గారు నమ్మిన సిద్ధాంతం. అందుకే ఆచరణ సాధ్యమైన హామీలనే టిఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇస్తూ వస్తున్నది. ఇచ్చిన హమీలను ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తున్నది. రైతుల రుణమాఫీ అందులో ముఖ్యమైనది.

14. 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో లక్ష రూపాయల లోపు ఉన్న రైతుల వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని టిఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. అందుకు అనుగుణంగా 16,124 కోట్ల రూపాయల రుణాలను పూర్తిగా మాఫీ చేసింది. తెలంగాణ రైతులకు ఉన్న ప్రత్యేక పరిస్థితుల రీత్యా గత ఎన్నికల్లో కూడా రైతు రుణ మాఫీ చేస్తామని టిఆర్ఎస్ పార్టీ హామీ ఇచ్చింది. ఆర్థిక మాంద్యం ముందరి కాళ్లకు బంధం వేస్తున్నప్పటికీ లెక్కచేయకుండా, రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని రుణ మాఫీ హామీ అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతున్నది.

15. 25 వేల రూపాయల లోపు రుణాలున్న రైతులు రాష్ట్రంలో 5,83,916 మంది ఉన్నారు. వారందరి రుణాలను నూటికి నూరు శాతం ఒకే దఫా మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెలలోనే 25 వేల రూపాయల లోపున్న రుణాలను మాఫీ చేయడానికి ప్రభుత్వం 1,198 కోట్ల రూపాయలను విడుదల చేస్తుంది. ఈ రుణ మాఫీ మొత్తాలను ప్రతీ రైతుకు వ్యక్తిగతంగా, చెక్కుల రూపంలో గౌరవ శాసన సభ్యుల చేతుల మీదుగా ప్రభుత్వం అందజేస్తుంది. 25 వేల నుంచి

లక్షలోపు ఉన్న రైతుల రుణాల మొత్తం 24,738 కోట్ల రూపాయలున్నాయి. వీటిని ప్రతీ రైతుకు వ్యక్తిగతంగా, చెక్కుల రూపంలో గౌరవ శాసన సభ్యుల చేతుల మీదుగా నాలుగు విడుతలుగా ప్రభుత్వం అందజేస్తుంది. ఈ ఏడాది రైతు రుణ మాఫీ కోసం 6,225 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

సకాలంలో విత్తనాలు - ఎరువులు:

16. ప్రభుత్వం దూరదృష్టితో వ్యవహరించి, ప్రతీ ఏటా ఎండాకాలంలోనే ఎరువులు, విత్తనాలు తెప్పించి గోదాముల్లో నిలువ చేస్తున్నది. ఇందు కోసం గోదాముల నిల్వ సామర్థ్యాన్ని పెద్ద ఎత్తున పెంచింది. సమైక్య రాష్ట్రంలో గోదాముల నిల్వ సామర్థ్యం 4.17 లక్షల మెట్రిక్ టన్నులు ఉండగా, నేడు 22.47 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాములను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. సీజన్ కన్నా ముందే రైతులకు విత్తనాలు, ఎరువులు అందుతుండటంతో రైతులు సకాలంలో, నిరందిగా వ్యవసాయ పనులు ప్రారంభించగలుగుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు 2013-14లో విత్తనాల సబ్సిడీ కోసం

మొత్తం 76 కోట్ల 71 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. 2019-20 సంవత్సరంలో అంతకు రెట్టింపుగా 142 కోట్ల రూపాయలను తెలంగాణ ప్రభుత్వం విత్తనాల సబ్సిడీకి అందచేసింది.

**ఉద్యాన వన పంటలకు ప్రోత్సాహం:**

17. పండ్లు, కూరగాయల సాగులో రాష్ట్రం స్వయం సమృద్ధి సాధించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ గారు సంకల్పించారు. తెలంగాణ రాష్ట్రంలో తోటల పెంపకానికి అవసరమైన పరిజ్ఞానాన్ని, పరిశోధనను పెంపొందించేందుకు ప్రభుత్వం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని ములుగులో కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట హార్టికల్చర్ యూనివర్సిటీని ఏర్పాటు చేసింది. మేడ్చల్ జిల్లా జీడిమెట్లలో, సిద్దిపేట జిల్లా ములుగులో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సు ను ఏర్పాటు చేసింది. ఈ సెంటర్లు నాణ్యమైన నారు సరఫరా చేయడంతో పాటు, రైతులకు కావల్సిన శిక్షణను, సాంకేతిక సహకారాన్ని అందిస్తున్నాయి.

కనీస మద్ధతు ధర:

18. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర లభించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. వరి, పత్తి, మొక్కజొన్న, కందులు తదితర పంటల కొనుగోలుకు పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా, రైతులకు సరైన ధర వచ్చేలా చేసింది. ఈ ఏడాది పండిన కందులలో కొద్ది శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది. కంది రైతులను ఆదుకునే లక్ష్యంతో ఎంత ఖర్చయినా సరే, మొత్తం కందులను కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

19. ఈ బడ్జెట్ లో మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ కోసం 1,000 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

మైక్రో ఇరిగేషన్:

20. తక్కువ నీటితో ఎక్కువ ఫలసాయం అందించే బిందు, తుంపర సేద్యాన్ని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నది. రాష్ట్రం ఏర్పాటయినప్పటి నుంచి మైక్రో ఇరిగేషన్ కోసం విరివిగా నిధులు కేటాయిస్తున్నది. డ్రిప్ ఇరిగేషన్ కోసం  షెడ్యూల్ కులాలు, షెడ్యూల్

తెగలకు 100 శాతం, బిసిలు, సన్న, చిన్న కారు రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం సబ్సిడీని ప్రభుత్వం కల్పిస్తున్నది. ఇప్పటిదాకా 2,49,200 మంది రైతులకు ఈ పథకం ద్వారా 1,819 కోట్ల రూపాయల లబ్ధి చేకూర్చడం జరిగింది.

21. ఈ ఏడాది 600 కోట్ల రూపాయలతో మైక్రో ఇరిగేషన్ కార్యక్రమాలను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**రైతు బంధు సమితులు:**

22. రైతు సమన్వయ సమితుల పేరును రైతుబంధు సమితులుగా మార్చాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని గవర్నర్ గారు తమ సందేశంలో పేర్కొన్నారు. అసంఘటితంగా ఉన్న రైతులను సంఘటిత శక్తిగా మార్చడం రైతుబంధు సమితుల ప్రధాన లక్ష్యం. మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా పంటలు పండించే విధంగా రైతుల్లో అవగాహన కల్పించి, సమన్వయం కుదర్చడానికి ఈ రైతు బంధు సమితులు దోహదపడతాయి.

రైతు వేదికలు:

23. రైతులు పరస్పరం చర్చించుకోవడానికి వీలుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ ఐదు వేల ఎకరాల క్లస్టర్ కు ఒకటి చొప్పున రైతు వేదికలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో రైతు వేదికను 12 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించాలని తలపెట్టింది.

24. రైతు వేదికల నిర్మాణం కోసం ఈ బడ్జెట్ లో 350 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

పాడి పరిశ్రమ – అభివృద్ధి:

25. వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేయడం కోసం ప్రభుత్వం పాడి పరిశ్రమకు ప్రోత్సాహకాలను అందిస్తున్నది. సమైక్య రాష్ట్రంలో విజయ డైరీ 30 కోట్ల రూపాయల నష్టాలతో మూత పడే పరిస్థితికి దిగజారింది. సమైక్య పాలకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం విజయ డైరీని ఉద్దేశ పూర్వకంగా నిర్వీర్యం చేశారన్నది నిర్వివాదాంశం. తెలంగాణ ఏర్పడిన తర్వాత విజయ డైరీ పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించింది. స్వచ్ఛమైన పాలను సరఫరా చేసి

వినియోగదారుల్లో విశ్వాసాన్ని పెంచింది. దీంతో అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. 2017-18 మరియు 2018-19 ఆర్థిక సంవత్సరాల్లో విజయ డైరీ 35 కోట్ల రూపాయల లాభాలను గడించిందని సభకు తెలియజేస్తున్నాను. సంస్థకున్న అప్పు 25 కోట్ల రూపాయలను చెల్లించడమే కాకుండా, 16 కోట్ల రూపాయలను వివిధ బ్యాంకుల్లో ఫిక్సుడ్ డిపాజిట్లు చేయగలిగింది. విజయ డైరీ పురోగతికి పాటుపడుతున్న సంస్థ పాలకవర్గాన్ని, ఉద్యోగులను, రైతులను ఈ సందర్భంగా ప్రభుత్వం హృదయపూర్వకంగా అభినందిస్తున్నది. ఈ స్ఫూర్తి ఇదే విధంగా మున్ముందు కూడా కొనసాగించాలని కోరుతున్నాను.

26. పాడి పరిశ్రమను బలోపేతం చేయడం కోసం రైతులనుంచి సేకరించే పాలపై లీటరుకు 4 రూపాయల చొప్పున ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందిస్తున్నది. దీని ద్వారా సుమారు 99 వేల 282 మంది పాడి రైతులు లబ్ధి పొందుతున్నారు. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు 248.03 కోట్ల రూపాయలను పాడి రైతులకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం చెల్లించింది.

27. పాడి రైతులకు అందించే ప్రోత్సాహకం కోసం ఈ సారి బడ్జెట్ లో 100 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

సాగు నీటి రంగం:

28. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని మహా కవి దాశరథి నినదిస్తే... నా తెలంగాణం కోటి ఎకరాల మాగాణం కావాలని గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు స్వప్నించారు. ఈ కల నెరవేరేందుకు అహరహం పరిశ్రమిస్తున్నారు. గోదావరి, కృష్ణా నదుల్లో తెలంగాణకు లభించే నీటిని సమగ్రంగా వినియోగించుకునేందుకు, ముఖ్యమంత్రి కేసీఆర్ గారు స్వయంగా పూనుకుని తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా ప్రాజెక్టులను రీడిజైన్ చేశారు. పొరుగు రాష్ట్రాలతో సయోధ్య నెలకొల్పారు. ప్రభుత్వం చారిత్రాత్మక అంతర్ రాష్ట్ర ఒప్పందాలు చేసుకున్నది. బడ్జెట్ లో సింహభాగం నిధులు నీటి పారుదల రంగానికి కేటాయిస్తూ, భారీ ప్రాజెక్టులను శరవేగంగా నిర్మిస్తున్నది. ఇంకో వైపు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నది.

**కాళేశ్వరం ప్రాజెక్టు:**

29. తెలంగాణ కలల పంట కాళేశ్వరం ప్రాజెక్టు. మూడేళ్ల రికార్డు సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి 2019 జూన్ లో గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు జాతికి అంకితం చేశారు. ప్రపంచంలోనే అతి పెద్ద బహుళ దశల ఎత్తిపోతల పథకంగా కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. ఇంత పెద్ద ప్రాజెక్టు ఇంత తక్కువ సమయంలో నిర్మించగలిగామంటే దానికి కారణం మన ముఖ్యమంత్రి గారి ఉక్కు సంకల్పం. మేడిగడ్డ వద్ద  సముద్ర మట్టానికి 100 మీటర్ల ఎత్తులో ప్రవహించే గోదావరి నీటిని, 618 మీటర్ల ఎత్తుకు లిఫ్టు చేసి సాగునీరు అందించే కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అద్భుతంగా చరిత్రలో నిలిచిపోతుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం త్వరిత గతిన పూర్తి కావడం వెనుక ముఖ్యమంత్రి గారి మేధోమథనం, తెలంగాణ ఇంజనీర్ల  సాంకేతిక ప్రతిభ, 50 వేల మంది కార్మికుల నిరంతరం శ్రమ దాగి ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మాణమైన వరుస బ్యారేజీలతో నేడు గోదావరి నది 150 కిలోమీటర్ల మేరకు జీవ ధారగా రూపు దాల్చింది. ఈ ప్రాజెక్టు

తెలంగాణ అభివృద్ధికి ఓ గ్రోత్ ఇంజన్. వ్యవసాయానికి వరదాయని. రేయింబవళ్లు ఎంతో శ్రమ కోర్చి, చాలా తక్కువ సమయంలోనే నిర్మాణాలు పూర్తి చేసిన నీటి పారుదల శాఖ ఇంజనీర్లను, కార్మికులను, భాగస్వాములైన ప్రతీ ఒక్కరినీ ఈ సందర్భంగా ప్రభుత్వం మనస్ఫూర్తిగా అభినందిస్తున్నది. ఇదే స్ఫూర్తితో పాలమూరు-రంగారెడ్డి, సీతారామ తదితర ప్రాజెక్టుల నిర్మాణం వేగంగా జరుపుతున్నది.

30. సమైక్య రాష్ట్రంలో తుమ్మలు మొలిచిన ఎస్సారెస్పీ కాలువలు నిండుగా ప్రవహిస్తున్న నీటితో కళకళలాడుతున్నాయి. చివరి భూముల దాకా సాగు నీరు అందుతున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు తొలి ఫలితం కరీంనగర్, వరంగల్, మహబూబాబాద్, జనగాం, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల రైతులకు అందింది. కాళేశ్వరంకు గుండెకాయ అయిన మిడ్ మానేరు 24 టీఎంసీల నీటితో నిండు కుండలా మారింది. కొద్ది కాలంలోనే రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్ల నిర్మాణం పూర్తవుతుంది. ఈ ప్రాజెక్టు ద్వారా అన్ని రిజర్వాయర్లు, వాటి కింద ఉండే చెరువులు, కుంటలు నింపాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు:

31. కరవు పీడిత ప్రాంతమైన పాలమూరు, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల రూపు రేఖలను మార్చే అద్భుతమైన ప్రాజెక్టు పాలమూరు - రంగారెడ్డి  ఎత్తిపోతల పథకం. అభివృద్ధి నిరోధక శక్తులు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రకరకాల పద్ధతుల్లో అడ్డుపడుతున్నప్పటికీ, ప్రభుత్వం పట్టుదలతో ఈ ప్రాజెక్టు పనులను జరిపిస్తున్నది. కాళేశ్వరం మాదిరిగానే ఈ ప్రాజెక్టును కూడా అనతి కాలంలో పూర్తి చేసే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి:

32. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి నడుం బిగించింది. సమైక్య రాష్ట్రంలో  నత్త నడకన సాగిన పెండింగ్ ప్రాజెక్టులను తెలంగాణ ప్రభుత్వం వేగంగా పూర్తి చేస్తున్నది.  ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇప్పటికే 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు, వెయ్యికి పైగా చెరువులను నీటితో నింపింది. దీంతో వలసలు నివారించబడుతున్నాయి. వ్యవసాయోత్పత్తి

గణనీయంగా పెరుగుతున్నది. మెదక్ జిల్లాలో సింగూరు కాల్వల నిర్మాణాన్ని ప్రభుత్వం పూర్తిచేసి, 40 వేల ఎకరాలకు సాగునీరు అందించింది. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా దాదాపు 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతున్నది.

33. ఖమ్మం జిల్లాలోని భక్త రామదాసు ప్రాజెక్టును 11 నెలల రికార్డు సమయంలో, పాలమూరు జిల్లాలోని తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని 8 నెలల కాలంలో పూర్తి చేసింది. ఖమ్మం జిల్లా సాగు నీటి అవసరాలను తీర్చే సంకల్పంతో సీతారామ ప్రాజెక్టు నిర్మాణం శరవేగంగా జరుగుతున్నది. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 10 లక్షల ఎకరాలకు సాగు నీరు, వందలాది గ్రామాలకు తాగు నీరు లభిస్తుంది.

34. సాగు నీటి పారుదల రంగానికి ఈ బడ్జెట్ లో 11,054 కోట్ల రూపాయలను ప్రతిపాదించడమైనది.

మిషన్ కాకతీయ:

35. ఉమ్మడి రాష్ట్రంలో గొలుసు కట్టు చెరువుల వ్యవస్థ దారుణమైన నిర్లక్ష్యానికి గురయింది. చెరువులు విధ్వంసం కావడం వల్ల తెలంగాణ

గ్రామీణ వ్యవస్థ సంక్షోభంలో పడింది. తెలంగాణ ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణ కోసం మిషన్ కాకతీయ పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమంగా చేపట్టింది. 46 వేల చెరువుల పునరుద్ధరణ లక్ష్యంగా సాగిన మిషన్ కాకతీయ అమోఘమైన ఫలితాలను సాధించింది. చెరువుల కింద 15 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది . చెరువులలో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు, భూగర్భ జల మట్టాలు గణనీయంగా పెరిగాయి.

మిషన్ భగీరథ:

36. నీరే ప్రాణకోటికి జీవాధారం. మంచి నీరు మంచి ఆరోగ్యానికి సోపానం. ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు అవలంభించిన విధానాల వల్ల తెలంగాణ తీవ్రమైన తాగు నీటి కష్టాలను అనుభవించింది. ఫ్లోరైడ్ విషం నిండిన నీటిని తాగడం వల్ల ఎముకలు బలహీనపడి, నడుములు వంగి తెలంగాణ బిడ్డలు దురవస్థలను అనుభవించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలు వర్షాకాలంలో కలుషిత నీరు తాగి మృత్యువాతన పడ్డారు. ఈ పరిస్థితిని మార్చి తీరాలని ముఖ్యమంత్రి కేసీఆర్ గారు అకుంఠిత దీక్షతో

మిషన్ భగీరథ పథకానికి రూపుదిద్దారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆవాస ప్రాంతాలకు మిషన్ భగీరథ ద్వారా సురక్షితమైన తాగు నీరు లభిస్తున్నది. మారు మూల ఆదీవాసీ గూడెంలకు కూడా నేడు స్వచ్ఛమైన తాగు నీరు సరఫరా అవుతున్నది. తెలంగాణ రాష్ట్రంలో గత ఆరేళ్లలో ఏ ఒక్కరూ ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడలేదని ఇండియన్ నేచురల్ రిసోర్సెస్ ఎకనమిక్ అండ్ మేనేజ్ మెంట్ ఫౌండేషన్ ఇటీవల ప్రకటించింది. ఇది తెలంగాణ రాష్ట్ర సాధన ద్వారా దక్కిన సార్థకతకు ఒక నిదర్శనమని సభకు సవినయంగా తెలియజేస్తున్నాను.

సంక్షేమ తెలంగాణ:

37. 40 వేల కోట్ల రూపాయలతో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు పేదలకు జీవన భద్రతను, భవిష్యత్తుపై భరోసాను కల్పిస్తున్నాయి. దేశంలో సంక్షేమం కోసం అత్యధిక నిధులు ఖర్చు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది.

38. అసహాయులైన పేదలకు అండగా నిలిచే విధంగా ప్రభుత్వం ఆసరా పెన్షన్లను అందజేస్తున్నది. వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులు, బోదకాలు బాధితులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులకు నేత, గీత కార్మికులకు అందించే పెన్షన్ మొత్తాన్ని వేయి రూపాయల నుంచి 2,016 రూపాయలకు ప్రభుత్వం పెంచింది. వికలాంగుల పెన్షన్ 1,500 రూపాయల నుంచి 3,016 రూపాయలకు పెంచింది. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి 57 ఏళ్లు నిండిన వారికి ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్ అందించబోతున్నదనే శుభవార్తను ఈ సందర్భంగా ప్రకటిస్తున్నాను. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలో ఆసరా పెన్షన్ల లబ్దిదారుల సంఖ్య 39,41,976 నుంచి మరింత పెరగనుంది. గత బడ్జెట్ లో ఆసరా పెన్షన్లకు 9,402 కోట్ల రూపాయలు కేటాయించగా, ఈ బడ్జెట్ లో 11,758 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమం:

39. అట్టడుగు వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందినపుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందనే విశ్వాసంతో తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్

కులాల, తెగల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. నేటికీ సమాజంలో ఎస్సీ, ఎస్టీలే అత్యంత పేదరికం అనుభవిస్తున్నారనేది నిజం. ఈ వర్గాల విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ వికాసం కోసం ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నది. ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా బడ్జెట్ లో నిధులు కేటాయిస్తున్నది. దేశానికే ఆదర్శంగా నిలిచేలా ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక ప్రగతి నిధి చట్టాన్ని తెచ్చింది. ఆయా వర్గాలకు కేటాయించిన నిధులు వారికే సంపూర్ణంగా ఖర్చయ్యే విధంగా చట్టంలో కఠినమైన నిబంధనలు పెట్టింది. ఒక ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులు పూర్తిగా ఖర్చు కాకపోతే, ఆ నిధులు వచ్చే ఆర్థిక సంవత్సరానికి బదలాయించాలని ఈ చట్టం నిర్దేశిస్తుంది. ఎస్సీ, ఎస్టీ నిధులను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీ తనంతో ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది.

40. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం 2018-19 ఆర్థిక సంవత్సరంలో చేసిన వ్యయాన్ని పూర్తి వివరాలతో, సమగ్ర సమాచారంతో కూడిన పెన్ డ్రైవ్ ను బడ్జెట్ ప్రసంగ ప్రతులతో పాటు గౌరవ సభ్యులకు అందచేయడం

జరిగింది. ఈ వివరాలను తమ తమ నియోజకవర్గాల వారీగా పరిశీలించుకోగలరని గౌరవ సభ్యులకు విజ్ఞప్తి చెస్తున్నాను. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధులను ఖర్చు చేసే విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని ప్రకటిస్తున్నాను. షెడ్యూల్డ్ కులాల వారి కోసం 268, షెడ్యూల్డ్ తెగల వారి కోసం 169 ప్రత్యేక గురుకుల విద్యాలయాలను ప్రభుత్వం నడుపుతున్నది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు విదేశాలలో విద్యనభ్యసించేందుకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ పథకం కింద 20 లక్షల రూపాయల వరకు ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తున్నది. ఎస్సీ, ఎస్టీ గృహ అవసరాల కోసం 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ను అందిస్తున్నది. ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే రుణాల్లోనూ, మైక్రో ఇరిగేషన్ ప్రోగ్రాముల్లోనూ సబ్సిడీని రెట్టింపు చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు మార్కెట్ చైర్ పర్సన్ పదవుల్లో రిజర్వేషన్లు అమలు చేస్తున్నది.

41. ఎస్సీ, ఎస్టీలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడం కోసం ప్రభుత్వం టీఎస్ ప్రైడ్ (TS-PRIDE), సి.ఎం.ఎస్.టి.ఇ.ఐ.(CMSTEI) పథకాలను ఏర్పాటు చేసింది. పెట్టుబడుల్లో రాయితీ, తగిన శిక్షణ, వ్యక్తిగత ప్రోత్సాహకాలను అందిస్తున్నది. ఈ ఏడాది ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు 338 కోట్ల రూపాయల ఇండస్ట్రియల్ ఇన్సెంటివ్ లను అందజేయడం జరిగింది. తండాలు, ఆదివాసీ గూడాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలు చేయాలనే ఎస్టీల చిరకాల డిమాండును ప్రభుత్వం నెరవేర్చింది. ఆదివాసీల ఆరాధ్య దైవాలైన సమ్మక్క సారలమ్మ జాతరను 75 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వం వైభవంగా నిర్వహించింది.

42. ఈ బడ్జెట్ లో ఎస్సీల ప్రత్యేక ప్రగతి నిధి కోసం 16,534.97 కోట్ల రూపాయలు, ఎస్టీల ప్రత్యేక ప్రగతి నిధికి 9,771.27 కోట్ల రూపాయలను ప్రతిపాదించడమైనది.

మైనార్టీల సంక్షేమం:

43. ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే ముస్లిం, మైనారిటీ ప్రజల్లో పేదరికం నెలకొని ఉంది. మైనారిటీలకు కూడా ఎస్సీ, ఎస్టీలకు అందించే ప్రత్యేక

రాయితీలు, వసతులు కల్పించాలని ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకున్నది. ఈ నిర్ణయం వల్ల మైనారిటీ విద్యార్థులు ఫీజ్ రీఇంబర్స్ మెంటు రూపంలో ఇప్పటిదాకా 137 కోట్ల రూపాయల అదనపు ప్రయోజనం పొందారు. మసీదుల్లో ప్రార్థనలు జరిపే ఇమాం, మౌజమ్ లకు నెలకు ఐదు వేల రూపాయలు గౌరవ భృతిని ప్రభుత్వం చెల్లిస్తున్నది. రంజాన్, క్రిస్మస్ పండుగలకు నూతన వస్త్రాలను పంపిణీ చేస్తున్నది. మైనార్టీ యువత స్వయం ఉపాధి కోసం ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నది. హైదరాబాద్ నగరం నాంపల్లిలో అనాథలకు ఆశ్రయం కల్పిస్తున్న అనీస్-ఉల్-గుర్బా నూతన భవన నిర్మాణం జరుగుతున్నది. టీఎస్ ప్రైమ్ (TS-PRIME) పేరుతో మైనార్టీ పారిశ్రామిక వేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహం కల్పిస్తున్నది. మైనార్టీ విద్యార్థుల కోసం 204 గురుకుల విద్యాలయాలను నడుపుతున్నది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 71 మైనార్టీ జూనియర్ కళాశాలలను ప్రభుత్వం ప్రారంభించనుంది. మైనారిటీ విద్యార్థుల విదేశీ విద్య కోసం ఓవర్సీస్ స్కాలర్ షిప్పులు అందిస్తున్నది.

44. షాదీ ముబారక్ పథకం ద్వారా ఇప్పటి వరకు 1,44,301 మంది మైనార్టీ వర్గాల యువతులు లబ్ధి పొందారు. 2019-20 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో కేటాయించిన రూ.1,369 కోట్ల నిధులు మైనారిటీ సంక్షేమం కోసం ఈ నెలాఖరి లోపు సంపూర్ణంగా ఖర్చు పెట్టబడుతాయి.

45. ఈ బడ్జెట్ లో మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.1,518.06 కోట్లు ప్రతిపాదించడమైనది.

**వెనుకబడిన తరగతుల సంక్షేమం:**

46. కుల వృత్తులు, చేతి వృత్తులపై ఆధారపడిన బీసీ కులాల వారికి ప్రత్యేక ఆర్థిక ప్రేరణ అందించడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకు వచ్చే విధంగా ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను చేపట్టింది. తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు నూతన ఉత్తేజాన్ని కలిగించింది.

**చేనేత కార్మికుల సంక్షేమం:**

47. చేనేత కార్మికుల జీవితాల్లో తెలంగాణ ప్రభుత్వం కొత్త వెలుగులు తీసుకురాగలిగింది. నూలు, రసాయనాలు, రంగుల మీద 50 శాతం

సబ్సిడీని అందిస్తున్నది. బతుకమ్మ చీరల పనిని అప్పగించడం ద్వారా చేతి నిండా ప్రభుత్వం పని కల్పిస్తున్నది. ప్రభుత్వం తరపున జరిపే వస్త్రాల కొనుగోళ్ల ఆర్డర్లను చేనేత, మర మగ్గాల సొసైటీలకే ఇస్తున్నది. పవర్ లూంలను ఆధునీకరించడం ద్వారా ఉత్పత్తి పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పవర్ లూం కార్మికులకు ప్రతీ నెలా 15,000/- రూపాయలకు తగ్గకుండా వేతనం పొందే విధంగా పవర్ లూం యాజమాన్యాలను ఒప్పించింది.

గొల్ల కురుమల సంక్షేమం:

48. గొల్ల కురుమల కుల వృత్తి అయిన గొర్రెల పెంపకం లాభదాయకమైనది, కాల పరీక్షకు తట్టుకొని నిలిచింది. మాంసం ఉత్పత్తిలో తెలంగాణ స్వయం సమృద్ధిని సాధించాలని, గొల్ల కురుమల ఆదాయం గణనీయంగా పెరగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చరిత్రలో ఎన్నడూ లేని స్థాయిలో గొర్రెల పంపిణీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 76 లక్షల 92 వేల 678 గొర్రెలను పంపిణీ చేసింది. వీటి ద్వారా మరో 70 లక్షల 88

వేల గొర్రె పిల్లలు ఉత్పత్తి అయ్యాయి. వాటి ద్వారా 3,189.60 కోట్ల రూపాయల విలువైన సంపద గొల్ల కురుమలకు, రాష్ట్రానికి సమకూరింది.

**కల్లు గీత కార్మికుల సంక్షేమం:**

49. గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నది. నీరాను శీతల పానీయంగా అమ్మటం ద్వారా గీత కార్మికుల ఆదాయం పెంచడానికి ప్రభుత్వం ప్రత్యేక పాలసీ తీసుకొచ్చింది. చెట్ల పన్నును, పాత బకాయిలను రద్దు చేయడం ద్వారా గీత కార్మికులకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. హరితహారం కార్యక్రమంలో భాగంగా తాటి, ఈత వనాల పెంపకం ముమ్మరంగా సాగిస్తున్నది. ప్రమాదవశాత్తూ మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ఆరు లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియాను అందిస్తున్నది.

**మత్స్యకారుల సంక్షేమం:**

50. తెలంగాణలో చేపల పెంపకాన్ని మత్స్య పరిశ్రమగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. రాష్ట్రంలో చెరువులను బాగుపర్చడం, నూతన జలాశయాలు నిర్మించడం, 150 కిలోమీటర్ల

గోదావరి నదిని సజీవంగా మార్చడం వల్ల మత్స్య పరిశ్రమ అభివృద్ధికి అవకాశాలు పెరిగాయి. 155 కోట్ల 64 లక్షల రూపాయలు వ్యయం చేసి, కోట్లాది చేప పిల్లలను, రొయ్య విత్తనాలను పంపిణీ చేసింది. దీని వల్ల రాష్ట్రంలో 2016-17లో చేపల దిగుబడి 1.99 లక్షల టన్నులు ఉండగా, 2018-19 సంవత్సరంలో 2.94 లక్షల టన్నులకు దిగుబడి పెరిగింది.

51. ఈ ఆర్థిక సంవత్సరానికి 90 కోట్ల చేప పిల్లలను, పదికోట్ల రొయ్య పిల్లలను పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. రాష్ట్ర వ్యాప్తంగా 28 చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల ఆధునికీకరణకు 20 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసింది. మార్కెటింగ్ సౌకర్యాలు, వలలు, వాహనాల కోసం, మత్స్య కార మహిళా సహకార సంఘాల కోసం గత మూడేళ్లలో ప్రభుత్వం 750 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల మత్స్యకారుని సగటు ఆదాయం గణనీయంగా పెరిగింది. 2016-17 సంవత్సరంలో మత్స్యకారుని సగటు ఆదాయం 48 వేల రూపాయలు ఉండగా, 2018-19 సంవత్సరానికి 71 వేల రూపాయలకు పెరిగింది.

52. ఈ బడ్జెట్ లో పశుపోషణ, మత్స్య శాఖకు రూ.1,586.38 కోట్లు ప్రతిపాదించడమైనది.

**కళ్యాణలక్ష్మి- బీసీల కోసం అదనపు నిధులు:**

53. కల్యాణలక్ష్మి పథకంలో ప్రయోజనం పొందే వెనుకబడిన తరగతులకు చెందిన లబ్ధిదారుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. బిసీలకు కల్యాణలక్ష్మి పథకం అమలు చేయడానికి ఈ ఏడాది అదనంగా 650 కోట్ల రూపాయలు కేటాయించి, ఈ బడ్జెట్ లో మొత్తం 1,350 కోట్ల రూపాయలను ప్రతిపాదించడమైనది.

**అత్యంత వెనుకబడిన వర్గాల సంక్షేమం:**

54. స్థిరమైన వృత్తి, స్థిరమైన జీవనం లేకుండా నేటికి కొన్ని బిసీ కులాల ప్రజలు అత్యంత దయనీయంగా జీవనం గడుపుతున్నారు. ఇలాంటి కులాలను సమైక్య రాష్ట్రంలో ప్రభుత్వాలు గుర్తించనైనా గుర్తించలేదు. అత్యంత వెనుకబడిన వర్గాల దుస్థితిని దృష్టిలో పెట్టుకుని, వారి సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఎంబీసీ కార్పోరేషన్ ను ఏర్పాటు చేసింది.

55. ఈ బడ్జెట్ లో ఎంబిసి కార్పొరేషన్ కు 500 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

**ఆత్మగౌరవ భవనాలు:**

56. రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాల ఆత్మగౌరవం ప్రతిబింబించే విధంగా హైదరాబాద్ నగరంలో ఆత్మ గౌరవ భవనాలను ప్రభుత్వం నిర్మిస్తున్నది. ఈ భవనాలు ఆయా వర్గాల విద్య, సాంస్కృతిక, సామాజిక వికాసానికి దోహదపడతాయి. వారి ఐక్యతా నిలయాలుగా నిలుస్తాయి. ఆత్మగౌరవ భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది.

57. మొత్తంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ఈ బడ్జెట్ లో 4,356.82 కోట్ల రూపాయలను ప్రతిపాదించడమైనది.

**మహిళా శిశు సంక్షేమం:**

58. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం. ఒక సమాజ వికాసానికి నిజమైన కొలమానం ఏదంటే.. ఆ సమాజంలో మహిళాభివృద్ధి స్థాయి

మాత్రమే అని అంబేద్కర్ మహాశయుడు చెప్పారు. వారి మాటలు మననం చేసుకుంటూ మహిళా లోకానికి ప్రభుత్వం పక్షాన మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

59. మహిళల వికాసానికి, భద్రతకు, వారి ఆత్మగౌరవం కాపాడేందుకు ప్రభుత్వం అనేక ఆదర్శనీయ నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తున్నది. ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా గర్భిణులకు, బాలింతలకు, శిశువులకు ప్రతీ రోజూ పాలు, గుడ్లతో కూడిన పోషకాహారం ప్రభుత్వం అందిస్తున్నది. గర్భిణీ స్త్రీలు ఆసుపత్రులకు వచ్చిపోవడానికి అమ్మఒడి వాహనాల ద్వారా ఉచిత రవాణా సదుపాయాన్ని కల్పించింది. కేసీఆర్ కిట్స్ తో గర్భిణీలకు ఆర్థిక సాయం అందిస్తున్నది. దేశంలో ఎక్కడా లేని విధంగా మార్కెట్ కమిటీల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ లు, పోలీసు ఉద్యోగ నియామకాల్లో 33 శాతం రిజర్వేషన్ లు, ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు రూ.2,016 పెన్షన్ ను అందజేస్తున్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థినుల కోసం 53 డిగ్రీ గురుకుల కాలేజీలను ప్రభుత్వం ప్రారంభించింది. విద్యార్థినులకు హెల్త్, హైజీన్ కిట్స్ లను ప్రభుత్వం

అందిస్తున్నది. మహిళలపై జరిగే అత్యాచారాలను, అఘాయిత్యాలను, ఈవ్ టీజింగ్ ను అరికట్టడం కోసం ఉమెన్ ప్రొటెక్షన్ సెల్, షీ టీమ్స్ అప్రమత్తంగా పని చేస్తున్నాయి. మహిళలను వేధించే వారి పట్ల ప్రభుత్వం కఠినాతి కఠినంగా వ్యవహరిస్తున్నది.

60. ఈ బడ్జెట్ లో మహిళా స్వయం సహకార సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద 1,200 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

పటిష్టమైన పంచాయతీ రాజ్ చట్టం:

61. తెలంగాణ గ్రామీణ జీవన ముఖ చిత్రాన్ని మార్చేందుకు ప్రభుత్వం సమగ్ర గ్రామీణ విధానం అమలు చేస్తున్నది. ఒక ఉద్యమంగా ప్రారంభమైన పంచాయతీ రాజ్ వ్యవస్థ కాలక్రమంలో లక్ష్యశుద్ధిని కోల్పోయి నీరసించింది. గ్రామాల అభివృద్ధిలో గ్రామ పంచాయతీలను క్రియాశీలకంగా మార్చేందుకు ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. ఇందులో భాగంగా కొత్త పంచాయతీ రాజ్ చట్టాన్ని తెచ్చింది. పంచాయతీ రాజ్ శాఖలో గ్రామ కార్యదర్శి నుంచి డిపిఓ (DPO) వరకు అన్ని స్థాయిల్లో ఖాళీలను భర్తీ చేసింది. అధికారులు, ప్రజా

ప్రతినిధుల్లో జవాబుదారీ తనాన్ని పెంచేందుకు చర్యలు తీసుకున్నది. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రజా ప్రతినిధులపైన, ఉద్యోగుల పైన కఠిన చర్యలు తీసుకోవడానికి చట్టం వీలు కల్పించింది. గ్రామ పంచాయతీల వివాదాలను పరిష్కరించడం కోసం ప్రత్యేక ట్రిబ్యునల్ ను ఏర్పాటు చేసింది.

**పల్లె ప్రగతి- 30 రోజుల ప్రణాళిక:**

62. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంచడం కోసం, గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడం కోసం ప్రభుత్వం రెండు విడతలుగా 'పల్లె ప్రగతి' కార్యక్రమం నిర్వహించింది. పల్లె ప్రగతి లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందాయి. తప్పని సరిగా ప్రతీ గ్రామానికి ఒక ట్రాక్టర్, ఓ నర్సరీ, ఒక స్మశానం, డంప్ యార్డులు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. ఇది ఒక విప్లవాత్మక చర్య. భారతదేశంలో ఇప్పటి వరకు తెలంగాణలో తప్ప మరే రాష్ట్రంలో కూడా అన్ని గ్రామాలకు ఇలాంటి వసతులు లేవని

సగర్వంగా ప్రకటిస్తున్నాను. పల్లె ప్రగతిలో భాగంగానే హరిత ప్రణాళికలు రూపొందించబడ్డాయి.

63. పల్లె ప్రగతి ద్వారా ప్రజలకు తమ సంఘటిత శక్తి గొప్పతనం తెలిసి వచ్చింది. ప్రజలంతా చేయి చేయి కలిపి ఉత్సాహంగా శ్రమ దానంలో పాల్గొన్నారు. మన గ్రామాన్ని మనమే బాగు చేసుకోవాలనే అవగాహనతో ప్రజలు ముందడుగు వేస్తున్నారు. రెండు విడతల పల్లె ప్రగతి గ్రామాల్లో గుణాత్మక మార్పు తెచ్చింది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇదే నిబద్ధతతో ఆదర్శ గ్రామాలను నిర్మించేందుకు కృషి చేయాలని ప్రభుత్వం కోరుతున్నది.

గ్రామాభివృద్ధికి నిధుల కేటాయింపు:

64. గ్రామాల అభివృద్ధికి కావాల్సిన నిధులను బడ్జెట్ లో నేరుగా ప్రభుత్వం కేటాయిస్తుంది. ఆర్థిక సంఘం నిధులతో పాటు, దానికి సమానంగా అంతే మొత్తాన్ని కలిపి రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలకు అందిస్తోంది. జాతీయ ఉపాధి హామీ పథకం కింద జరిగే పనుల్లో వస్తు సామాగ్రి వ్యయం కోసం ప్రతీ నెలా 65 కోట్ల రూపాయలను ప్రభుత్వం

కేటాయిస్తున్నది. 600 కోట్ల రూపాయల వ్యయంతో గ్రామాల్లో ప్రభుత్వం సిసి రోడ్ల నిర్మాణం చేపట్టింది. పంచాయతీల్లో 36 వేల మంది పారిశుద్ధ కార్మికులు వేతనాలను 8,500/- రూపాయలకు ప్రభుత్వం పెంచింది. గ్రామ పంచాయతీల్లో పని చేసే సిబ్బందికి 2 లక్షల జీవిత బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది.

65. పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి కోసం ఈ బడ్జెట్ లో రూ.23,005 కోట్లు ప్రతిపాదించడమైనది.

**నూతన మున్సిపల్ చట్టం:**

66. తెలంగాణలో పట్టణీకరణ శరవేగంగా పెరుగుతున్నది. దీనికి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పట్టణాలు విస్తరించాల్సి ఉంది. సరైన ప్రణాళికను అనుసరించకపోవడంతో పట్టణాలు అడ్డదిడ్డంగా పెరిగి అసౌకర్యానికి, అశుభ్రతకు ఆనవాళ్లుగా మారిపోతున్నాయి. మురికి వాడలు విస్తరిస్తున్నాయి. మున్సిపాలిటీల పని తీరులో పారదర్శకతను పెంపొందించేందుకు ప్రభుత్వం నూతన మున్సిపాలిటీ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. కొత్త చట్టంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల బాధ్యతలను

స్పష్టంగా నిర్వచించడం జరిగింది. ఆస్తుల విలువ మదింపుకు సెల్ఫ్ డిక్లరేషన్ విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. టిఎస్ ఐపాస్ తరహాలో సులభ పద్ధతుల్లో భవన నిర్మాణ అనుమతులు ఇచ్చేందుకు టిఎస్ బి-పాస్ విధానాన్ని ప్రభుత్వం త్వరలో అమలు చేయబోతున్నది.

పట్టణ ప్రగతి:

67. పట్టణాల్లో పచ్చదనం- పారిశుధ్యం మెరుగుపడడానికి, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి అలవాటు చేయడం కోసం ప్రభుత్వం పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహించింది.

68. పట్టణాల్లో పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడం వల్ల ప్రజలు, ప్రధానంగా మహిళలు ఎంతో బాధ అనుభవిస్తున్నారు. దీన్ని నివారించేందుకు ప్రభుత్వ స్థలాల్లోనే పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మూడు నెలల్లోనే అన్ని పట్టణాల్లో అవసరమైనన్ని పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని ప్రభుత్వం ఇప్పటికే ప్రజా ప్రతినిధులకు, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

69. తడి, పొడి చెత్త సేకరణ, రవాణా కోసం ప్రభుత్వం అన్ని పట్టణాలకు వాహనాలను సమకూరుస్తున్నది. డంపింగ్ యార్డు కోసం స్థలాల గుర్తింపు పూర్తయింది. నిర్మాణ ప్రక్రియ ప్రారంభమయింది. పల్లెల్లో మాదిరిగానే వంగిన, తుప్పు బట్టిన స్థంభాలను మార్చడం, వదులుగా ఉన్న తీగలను బిగించడం జరుగుతున్నది. వైకుంఠధామాలు, సమీకృత మార్కెట్లు, పార్కులు, ఓపెన్ జిమ్స్, ఆటస్థలాల నిర్మాణం కోసం అన్ని పట్టణాల్లో స్థలాల గుర్తింపు జరుగుతున్నది. ఆటోలు, టాక్సీలు నిలుపుకోవడానికి, వీధి వ్యాపారులు, తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకోవడానికి ప్రత్యేక జోన్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది. పట్టణాల, నగరాల అభివృద్ధికి ప్రతీ నెలా ప్రభుత్వం 148 కోట్ల రూపాయల నిధులను విడుదల చేస్తున్నది. పట్టణ మిషన్ భగీరథ పథకం కింద మిగిలిపోయిన 38 మున్సిపాలిటీలకు గాను 800 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాము.

70. మున్సిపల్ శాఖకు ఈ బడ్జెట్ లో 14,809 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

హైదరాబాద్ నగర అభివృద్ధి:

71. తెలంగాణకు తలమానికమైన నగరం హైదరాబాద్. 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ నగరం ప్రపంచంలోనే అత్యుత్తమమైన నివాస యోగ్యత కలిగిన నగరంగా పేరు ప్రతిష్టలు పొందింది. సమైక్య పాలకుల అస్తవ్యస్త విధానాల వల్ల నగరం జీవనం అతలాకుతలమైంది. జనాభా పెరిగినంతగా, సౌకర్యాల కల్పన జరగలేదు.

72. భారతదేశంలోని ఆరు మెట్రో నగరాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని మన ముఖ్యమంత్రి గారు అనేక సార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రం హైదరాబాద్ సహా ఇతర నగరాలకు ప్రత్యేక నిధులు కేటాయించలేదు. అంతర్జాతీయ నగరంగా రూపుదిద్దుకుంటున్న రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడానికి వచ్చే ఐదేళ్లలో 50 వేల కోట్ల రూపాయలు అవసరమని తెలంగాణ ప్రభుత్వం అంచనా వేసింది. హైదరాబాద్ నగరం, దాని పరిసర ప్రాంతాల అభివృద్ధితో పాటు, మూసీ నది ప్రక్షాళన, మూసీ రివర్ ఫ్రంట్

ప్రాజెక్టు అమలు కోసం ఈ బడ్జెట్ లో ప్రత్యేకంగా 10 వేల కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

73. హైదరాబాద్ మెట్రో రైలు, డిల్లీ తర్వాత అతి పెద్ద మెట్రో మార్గంగా చరిత్రకెక్కింది. గతంలోనే మియాపూర్ నుండి ఎల్బీనగర్, నాగోల్ నుండి అమీర్ పేట, ఆమీర్ పేట నుంచి రాయదుర్గం వరకు మెట్రో నడుస్తున్నది. ఇటీవలే పూర్తయిన జూబ్లీబస్ స్టేషన్ నుంచి ఇమ్లీబన్ వరకు మెట్రో రైలు పరుగులు ప్రారంభించింది. పాత నగరంలో మిగిలిన ఐదు కిలోమీటర్ల మార్గం త్వరలోనే పూర్తవుతుంది. రెండో దశలో భాగంగా రాయదుర్గం నుంచి శంషాబాద్, బీ.హెచ్.ఈ.ఎల్ నుండి లక్డీకాపూల్ వరకు మెట్రో రైలు ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి.

విద్యారంగం:

74. సమాజ పరివర్తనకు ఉపయోగపడే గొప్ప సాధనం విద్య. అట్టడుగు వర్గాల ప్రజలు సాధికారికతను సాధించేందుకు విద్య దోహద పడుతుంది. అందుకే ప్రభుత్వం పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య అందించాలనే లక్ష్యంతో పెద్ద ఎత్తున గురుకుల

విద్యాలయాలను ప్రారంభించింది. మంచి భోజనం, వసతి, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందించడం కోసం ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం 959 గురుకుల విద్యాలయాలు నడుపుతున్నది.

75. విదేశాల్లో విద్యనభ్యసించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఒక్కొక్కరికీ 20 లక్షల రూపాయల వరకు ఓవర్సీస్ స్కాలర్ షిప్స్ అందిస్తున్నది. వివిధ విద్యాలయాల్లో చదివే పేద విద్యార్థుల ఫీజు భారాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తున్నది.

76. ఈ బడ్జెట్ లో ఫీజు రీఇంబర్స్ మెంటు కోసం రూ.2,650 కోట్లు ప్రతిపాదిస్తున్నది.

77. కేవలం విద్యాశాఖ ద్వారా మాత్రమే కాకుండా, రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్వహణకు, ఫీజు రీఇంబర్స్ మెంటు కోసం, స్కాలర్ షిప్పుల కోసం వివిధ వర్గాల సంక్షేమ నిధులు కూడా విద్యారంగ వికాసం కోసం ప్రభుత్వం వెచ్చిస్తున్నదనే విషయాన్ని గౌరవ సభ్యులు గమనించాలని కోరుతున్నాను.

78. పాఠశాల విద్యాశాఖకు ఈ బడ్జెట్ లో రూ.10,421 కోట్లు ప్రతిపాదించనైనది.

79. ఉన్నత విద్యాశాఖకు ఈ బడ్జెట్ లో రూ.1,723.27 కోట్లు ప్రతిపాదించనైనది.

సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమం:

80. అక్షరాస్యత వల్ల సామాజిక చైతన్యం పెరుగుతుంది. తెలంగాణ రాష్ట్రాన్ని సంపూర్ణ అక్షరాస్యత సాధించే రాష్ట్రంగా మార్చడం కోసం ముఖ్యమంత్రి గారు ఈచ్ వన్ టీచ్ వన్ అనే స్ఫూర్తి దాయక నినాదాన్ని అందించారు. రాష్ట్రంలో నిరక్షరాస్యతను నిర్మూలించడం కోసం ప్రత్యేక కార్యక్రమాల రూపకల్పన జరుగుతున్నది. ఇందు కోసం ఈ బడ్జెట్ లో వంద కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

వైద్య రంగం:

81. ఆరోగ్య తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రజా వైద్య రంగాన్ని అభివృద్ధి చేయడానికి విస్తృత చర్యలు చేపట్టింది. కేసీఆర్ కిట్

పథకం అద్భుత ఫలితాలు సాధించింది. ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాల సంఖ్య 22 శాతం పెరిగింది. 40 ప్రభుత్వాసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలను, 20 ఐసీయూ కేంద్రాలను ఏర్పాటు చేసింది. 305 స్టాండరైజ్డ్ లేబర్ రూములను, గర్భిణీ స్త్రీలు ఆసుపత్రికి వచ్చిపోవడానికి 200 అమ్మఒడి వాహనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల ప్రజా వైద్యంపై నమ్మకం పెరిగింది. ప్రభుత్వాసుపత్రుల్లో ఇన్ పేషంట్ల సంఖ్య 20 శాతం పెరిగింది.

82. రాష్ట్రంలో గతంలో కేవలం ఐదు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవి. ప్రభుత్వం కొత్తగా 4 మెడికల్ కాలేజీలు ప్రారంభించి, రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్యను 9 కి పెంచింది.

83. హైదరాబాద్ నగరంలో 118 బస్తీ దవాఖానాలు పేదలకు వైద్య సేవలు అందిస్తున్నాయి. ఈ బస్తీ దవాఖానాలకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. పేదలకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. హైదరాబాద్ నగరంలో బస్తీ దవాఖానాల సంఖ్యను 350 కి పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పుడు నడుస్తున్న వాటితో పాటు,

నగరంలో మరో 232 బస్తీ దవాఖానాలను ప్రభుత్వం త్వరలోనే ప్రారంభిస్తుంది. ప్రతీ డివిజన్ లో కనీసం రెండు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయడంతో పాటు ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, పేదలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో అదనంగా బస్తీ దవాఖానాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది.

84. రాష్ట్రంలోని ప్రజల కంటి సంబంధ సమస్యలను పరిష్కరించడానికి కంటి వెలుగు పేరుతో ప్రపంచంలోనే అతి భారీ ఐ స్క్రీనింగ్ డ్రైవ్ ను తెలంగాణ ప్రభుత్వం నిర్వహించింది. కోటి 54 లక్షల మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగానే మందులు, అద్దాలు పంపిణీ చేయడం జరిగింది.

85. కంటి వెలుగు తరహాలోనే చెవి, ముక్కు, గొంతు, దంత సంబంధమైన వ్యాధుల నిర్ధారణ కోసం త్వరలో ప్రత్యేక కార్యాచరణను ప్రభుత్వం ప్రారంభిస్తుంది. తెలంగాణలోని ప్రతీ పౌరుడికి వైద్య పరీక్షలు నిర్వహించి తెలంగాణ హెల్త్ ప్రోఫైల్ రూపొందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నది.

86. ప్రజా వైద్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు మంచి ఫలితాలు అందించాయని చెప్పడానికి, అత్యుత్తమ వైద్య సేవల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మూడో స్థానంలో నిలిచినట్లు నీతి అయోగ్ చేసిన ప్రకటనే నిదర్శనం.

87. ఈ బడ్జెట్ లో వైద్య రంగానికి 6,186 కోట్ల రూపాయలను ప్రతిపాదించడమైనది.

88. రాష్ట్రంలో కరోనా వైరస్ గురించి చర్చ జరుగుతున్నది. మన రాష్ట్రంలో కరోనా వైరస్ ప్రబలకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నది. వేసవిలో ఉండే ఎండ వేడికి వైరస్ మనుగడలో ఉండే అవకాశమే లేదని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఎండాకాలం ప్రారంభమయినందున ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అయినప్పటికీ ప్రభుత్వం అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నది. ప్రజలు కరోనా వైరస్ పై చెలరేగే వదంతులు నమ్మవద్దని కోరుతున్నాను.

విద్యుత్తు విజయం:

89. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం విద్యుత్ రంగంలో అద్భుత విజయం సాధించింది. రాష్ట్రంలో విద్యుత్ సమస్యను సంపూర్ణంగా పరిష్కరించింది. రాష్ట్రం అవతరించిన తొలినాళ్లలో ప్రభుత్వానికి ఎదురయిన పెను సవాల్ విద్యుత్ సంక్షోభం. భారీ స్థాయిలో ఏర్పిడిన విద్యుత్తు లోటు, గంటల తరబడి విద్యుత్ కోతలతో జన జీవనం దుర్భరంగా మారింది. రాష్ట్ర ప్రగతికి తీవ్ర అవరోధంగా మారిన విద్యుత్ సమస్య పరిష్కారాన్ని మన ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఛాలెంజ్ గా తీసుకున్నారు. కరెంటు కష్టాలను రూపు మాపేందుకు వ్యూహాలను రూపొందించి అమలు చేశారు. వీటి ఫలితంగా తెలంగాణ రాష్ట్రం చాలా తక్కువ వ్యవధిలోనే కరెంటు కష్టాలను అధిగమించింది. నేడు అన్ని రంగాలకు 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేసుకోగలుగుతున్నాం. రైతులకు 24 గంటల పాటు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రంగా ఇవాళ తెలంగాణ రాష్ట్రం దేశం ముందు సగర్వంగా నిలబడింది.

90. ప్రగతి సూచికల్లో ప్రధానమైన తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ గా నిలిచింది. తెలంగాణలో తలసరి విద్యుత్ వినియోగం 1,896 యూనిట్లు కాగా, దేశంలో తలసరి విద్యుత్ వినియోగం 1,181 యూనిట్లు కావడం విద్యుత్ రంగంలో మనం సాధించిన అద్భుత పురోగతికి కొలమానం. 58 సంవత్సరాల సమైక్య రాష్ట్ర చరిత్రలోనే 13,162 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ఏర్పడితే, తెలంగాణ రాష్ట్రంలో 13,168 మెగావాట్ల గరిష్ట డిమాండ్ వచ్చింది. ఇంత డిమాండ్ వచ్చినా ఎక్కడా ఒక్క సెకను కూడా కోత విధించకుండా విద్యుత్ సరఫరా చేయగలగడం మనం సాధించిన విద్యుత్ విజయానికి ఓ సంకేతం.

91. ఈ బడ్జెట్ లో విద్యుత్ శాఖకు 10,416 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

పరిశ్రమలు:

92. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రగతి శీల పారిశ్రామిక విధానం వల్ల రాష్ట్రంలోకి పెద్ద ఎత్తున పెట్టుబడులు తరలివస్తున్నాయి. టీఎస్ఐపాస్ చట్టం తెలంగాణ పారిశ్రామిక రంగానికి వరంగా మారింది. ఇప్పటిదాకా

12,427 పరిశ్రమలు ఈ విధానం ద్వారా అనుమతులు పొందాయి. వీటి ద్వారా రెండు లక్షల నాలుగు వేల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి తరలివచ్చాయి. 14 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. అంతర్జాతీయ కంపెనీలు, స్టార్టప్ కంపెనీలు మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. ఈ ఏడాది ఇండస్ట్రియల్ ఇన్సెంటివ్స్ కోసం బడ్జెట్ లో 1,500 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

93. ఈ బడ్జెట్ లో పారిశ్రామిక రంగ అభివృద్ధి కోసం రూ.1,998 కోట్లు ప్రతిపాదించడమైనది.

ఇన్ఫర్ మేషన్ టెక్నాలజి (ఐ.టి):

94. అంతర్జాతీయంగా పేరుపొందిన ఐటీ దిగ్గజాల పెట్టుబడులకు హైదరాబాద్ కేంద్ర స్థానంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఐటీ విధానంతో ఈ రంగంలో పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. అంకుర పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన టీ-హబ్ యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది. మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహకంగా

వీ-హబ్ ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2013-14 లో ఐ.టి ఎగుమతుల విలువ 57 వేల కోట్ల రూపాయలు ఉంటే, 2018-19 నాటికి లక్షా 9 వేల కోట్లకు పెరగడం ఐటి రంగంలో మనం సాధించిన అభివృద్ధికి నిదర్శనం. మైక్రోసాఫ్ట్, గూగుల్, ఐబీఎం, ఒరాకిల్ వంటి బహుళ జాతి కంపెనీలతో పాటు ఇన్ఫోసిస్, విప్రో, టెక్ మహీంద్ర, టీసీఎస్ వంటి దేశీయ ఐటీ దిగ్గజాలు తమ వ్యాపారాలను తెలంగాణలో విస్తరించాయి. ఐటీ పరిశ్రమను ఒక్క హైదరాబాద్ లోనే కాకుండా వరంగల్, కరీంనగర్ తదితర టైర్ - 2, టైర్ -3 నగరాల్లో విస్తరింపజేస్తున్నాం.

ఆర్టీసీ అభివృద్ధి:

95. ప్రజల ప్రయాణ అవసరాలను తీర్చే ఆర్టీసీ ఇటీవల ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల లాభాల బాటలోకి వస్తున్నది. కార్గో, పార్సిల్ సర్వీసును సైతం ఆర్టీసీ ప్రారంభించింది. ఆర్టీసీ ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సును ప్రభుత్వం 60 ఏళ్లకు పెంచింది. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి ఎంప్లాయిస్ బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది.

96. ఈ బడ్జెట్ లో ఆర్టీసీకి 1,000 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

డబుల్ బెడ్ రూం ఇళ్లు:

97. ఇల్లు మంచిగా ఉంటేనే... ఇంటిల్లి పాది మంచిగ ఉంటరు. ఇల్లు ఇరుకైతే...బ్రతుకులు అంతకంటే ఇరుకుగా మారిపోతాయి. పేదల సొంతింటి కలను నిజం చేయడమే కాకుండా వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టే విధంగా రెండు బెడ్ రూంల ఇళ్లను ఉచితంగా పేదలకు ఇవ్వాలని ముఖ్యమంత్రి గారు సంకల్పించారు. లబ్దిదారులపై ఒక్క రూపాయి భారం పడకుండా ప్రభుత్వమే పూర్తి ఖర్చుతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మిస్తున్నది. రాష్ట్రంలో ప్రస్తుతం 2,72,763 ఇండ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. గత ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా స్వంత స్థలం కలిగిన పేదలు ఆ స్థలంలోనే రెండు పడక గదుల ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో లక్ష మంది లబ్ధిదారులకు తమ స్వంత స్థలంలో

ఇళ్లు నిర్మించుకోవడానికి అవసరమైన ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తుందని సభకు సంతోషంగా విన్నవిస్తున్నాను.

98. ఈ బడ్జెట్ లో గృహ నిర్మాణాల కోసం 11,917 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

**హరితహారం:**

99. పర్యావరణం సరిగా లేనప్పుడు సంపద, సౌకర్యాలు ఎంత పెరిగినా మనిషి ప్రశాంతంగా జీవనం సాగించలేడు. నేడు ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగి, ఆక్సిజన్ తరిగి మానవ జీవితం దుర్భరంగా మారుతున్నది. మన రాష్ట్రంలో పచ్చదనాన్ని 33 శాతానికి పెంచేందుకు తద్వారా వాతావరణ సమతుల్యం కాపాడేందుకు, అధిక ఉష్ణోగ్రత తగ్గించేందుకు ప్రభుత్వం తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రతీ చోట విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. అడవుల నరికివేతను, కలప స్మగ్లింగ్ ను అడ్డుకోవడానికి ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నది. అటవీ భూములలో అడవులను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టింది.

అర్బన్ పార్కులను అభివృద్ధి పరుస్తున్నది. రాష్ట్రంలో మొక్కలు నాటడం, నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను ప్రజా ప్రతినిధులకు, అధికారులకు తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం చట్టం చేసింది. నూతన పంచాయతీ రాజ్, మున్సిపల్ చట్టాల ప్రకారం వారి వారి బడ్జెట్లలో పది శాతం నిధులను విధిగా హరిత ప్రణాళిక అమలుకు ఖర్చు చేయాలని చట్టంలో నిబంధనను పొందుపరిచింది.

100. ఈ బడ్జెట్ లో పర్యావరణ, అటవీశాఖకు 791 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

**దేవాలయాల అభివృద్ధి:**

101. దేవాలయాలు ఆధ్యాత్మికతకు, సనాతన ధర్మానికి నిలయాలు. తెలంగాణలోని దేవాలయాలకు పునర్వైభవం తేవడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తున్నది. యాదాద్రి క్షేత్రాన్ని ప్రభుత్వం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నది. ఈ దివ్య క్షేత్రంలోని దేవాలయాన్ని వైభవోపేతంగా పునర్నిర్మిస్తున్నది. ఈ బడ్జెట్ లో రాష్ట్రంలోని వివిధ దేవాలయాల అభివృద్ధి కోసం రూ.500 కోట్లు ప్రతిపాదించడమైనది.

102. రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల్లో ధూపదీప నైవేద్యాల కోసం మరియు వాటి నిర్వహణ కోసం ఈ బడ్జెట్ లో 50 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాము. పూజారులకు అర్చక నిధి ద్వారా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లిస్తున్నది.

రహదారులు – భవనాలు:

103. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి సమగ్ర విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నది. రహదారుల నిర్మాణం, నిర్వహణకు 750 కోట్లు బడ్జెట్ లో ప్రతిపాదిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో సమీకృత కలెక్టరేట్లు, జిల్లా పోలీసు కార్యాలయాల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నది. ఇప్పటికే చాలా జిల్లాల్లో నిర్మాణాలు పూర్తికాగా, మరికొన్ని చోట్ల చివరి దశలో ఉన్నాయి. త్వరలోనే ఈ నిర్మాణాలన్నీ పూర్తి చేయాలని ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంది. కలెక్టరేట్లు, డిపివోలు, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణాలను ఈ ఏడాదిలో పూర్తి

చేయడం కోసం 550 కోట్ల రూపాయలను ఈ బడ్జెట్ లో ప్రతిపాదించనైనది.

104. మొత్తంగా రవాణా మరియు రోడ్లు భవనాల శాఖకు ఈ బడ్జెట్ లో 3,494 కోట్ల రూపాయలను ప్రతిపాదించనైనది.

శాంతిభద్రతలు:

105. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. పోలీస్ శాఖ ఆధునీకరణకు, శిక్షణకు, వారి జీవన ప్రమాణాల పెంపుకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు, వాహనాల కొనుగోలుకు ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు ఖర్చు చేసింది. ఈ చర్యలతో పోలీస్ శాఖ పని తీరు ఎంతో మెరుగుపడింది. ఫలితంగా తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణ సమర్థవంతంగా జరుగుతున్నది. హైదరాబాద్ లో కర్ఫ్యూలు, కల్లోలాలు లేకుండా జన జీవనం ప్రశాంతంగా సాగుతున్నది. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ నగరంలో చేపట్టిన పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణం

త్వరలోనే పూర్తి కానున్నది. గుడుంబా రక్కసిని ఉక్కుపాదంతో అణచివేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకున్నది.

106. ఈ బడ్జెట్ లో పోలీస్ శాఖకు 5,852 కోట్ల రూపాయలు ప్రతిపాదించడమైనది.

**అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి నిధులు:**

107. ప్రజల చేత చట్టసభలకు ఎన్నుకోబడి, రాష్ట్ర అభివృద్ధికి విధానాలు రూపొందించే వారు గౌరవ శాసన సభ్యులు. ఇంతటి గురుతర బాధ్యత నిర్వర్తించే ఎమ్మెల్యేలకు తమ సొంత నియోజక వర్గాల్లో ఇంత వరకు కనీసం ఓ కార్యాలయం కూడా లేదు. ఈలోటును గమనించిన మన ముఖ్యమంత్రి గారు ఎమ్మెల్యేలకు కార్యాలయాలు కట్టించాల్సిన అవసరాన్ని గుర్తించారు. ఇప్పటివరకు 82 నియోజక వర్గాల్లో కార్యాలయాల నిర్మాణం పూర్తయింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ నియోజక వర్గాల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించుకోవడం కోసం ఒక్కొక్కరికి 3 కోట్ల రూపాయల చొప్పున నియోజకవర్గం అభివృద్ధి

నిధులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిధుల వినియోగానికి సంబంధించి ప్రభుత్వం త్వరలోనే మార్గదర్శకాలు విడుదల చేస్తుంది.

108. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఎస్.డి.పి నిధుల కోసం ఈ బడ్జెట్ లో రూ.480 కోట్లు ప్రతిపాదించనైనది.

ఆదాయ మార్గాల పెంపు:

109. దేశంలో ఆర్థిక మాంద్యం నెలకొన్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాలతో పోల్చితే మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గుడ్డిలో మెల్ల అన్న చందంగా కొంత మెరుగ్గానే ఉంది. గత ఐదేళ్లలో రాష్ట్రం సొంత రాబడి సగటు వృద్ధి రేటు 21.5 శాతం ఉంటే, ఈ సంవత్సరం ఫిబ్రవరి మాసాంతానికి 6.3 శాతానికి తగ్గింది. అంటే 15.2 శాతం తగ్గింది. మారిన ఆర్థిక పరిస్థితులను అంచనా వేసుకుంటూ, ఎప్పటికప్పుడు ఉత్పన్నమయ్యే పరిస్థితులకు తగ్గట్టు వ్యూహ రచన చేస్తూ ప్రభుత్వం ఆర్థిక ప్రణాళికలు రూపొందిస్తున్నది.

110. స్థిర అభివృద్ధికి మూల స్తంభం పెట్టుబడి వ్యయం. ఆర్థిక శాస్త్రంలో చెప్పిన గోల్డెన్ రూల్ ప్రకారం వివిధ సంస్థల నుండి తెస్తున్న రుణాలన్నింటినీ పెట్టుబడి వ్యయం కోసమే ప్రభుత్వం వినియోగిస్తున్నది.

కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ దీనికి నిదర్శనం. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం ఉనికిలో లేని దశలో ప్రభుత్వం హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ లాంటి సంస్థలను ఏర్పాటు చేసింది. వర్తమాన కాలంలో రియల్ ఎస్టేట్ రంగం పెద్ద పరిశ్రమగా విస్తరించింది. ఈ దశలో ప్రభుత్వ రంగంలో ఉన్న రాజీవ్ స్వగృహ తరహాలో నిరర్థకంగా పడి ఉన్న ఆస్తులను పారదర్శకంగా విక్రయించడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. మన రాష్ట్రం ఖనిజ సంపదకు నెలవు. ఇసుక, ఇతర ఖనిజాల ద్వారా వచ్చే ఆదాయాన్ని మరింత పెంచుకునేందుకు పకడ్బందీ వ్యూహాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**2018-19 అకౌంట్లు (ప్రొవిజనల్):**

**111. 2018-19 ఆర్థిక సంవత్సరం లెక్కల ప్రకారం రూ.1,57,150.80 కోట్లు ఖర్చు అయింది. రెవెన్యూ మిగులు రూ.4,337.08 కోట్లు. ద్రవ్యలోటు రూ.26,943.87 కోట్లు.**

**2019-20 సవరించిన అంచనాలు:**

**112. సవరించిన అంచనాల ప్రకారం, 2019-20 సంవత్సరానికి చేసిన మొత్తం అంచనా వ్యయం 1,42,152.28 కోట్ల రూపాయలు. ఇందులో రెవెన్యూ వ్యయం 1,10,824.77 కోట్ల రూపాయలు కాగా మూలధన వ్యయం 13,165.72 కోట్ల రూపాయలు. సవరించిన అంచనాల ప్రకారం రెవెన్యూ ఖాతాలో మిగులు 103.55 కోట్ల రూపాయలు.**

**2020-21 బడ్జెట్ అంచనాలు:**

**113. 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.1,82,914.42 కోట్ల వ్యయాన్ని ప్రతిపాదిస్తున్నాను. దీనిలో రెవెన్యూ వ్యయం రూ.1,38,669.82 కోట్లు, మరియు క్యాపిటల్ వ్యయం రూ.22,061.18 కోట్లు. బడ్జెట్ అంచనాలలో రెవెన్యూ మిగులు రూ.4,482.12 కోట్ల రూపాయలు కాగా, ఆర్థిక లోటు రూ.33,191.25 కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా.**

ముగింపు:

114. ఆర్థిక మాంద్యానికి విరుగుడు ప్రజల కొనుగోలు శక్తిని పెంచడమే. సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చుతున్నది. ప్రజల కొనుగోలు శక్తిని అంతకంతకూ పెంచడం, పెట్టుబడి వ్యయానికి నిధులు వినియోగించడం అనే ద్విముఖ వ్యూహంతో ప్రభుత్వం ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నది.

115. గ్రామ స్థాయి నుంచి పార్లమెంట్ వరకు అన్ని రకాల ఎన్నికలు పూర్తయ్యాయి. ప్రతీ ఎన్నిక సందర్భంలో ప్రజలు మా ప్రభుత్వం మీద సంపూర్ణ విశ్వాసాన్ని కనపర్చారు. మేం ఎంచుకున్న బాట సరైందని, మేం అవలంబిస్తున్న వ్యూహాలు సఫలం అవుతున్నాయని ప్రజా నిర్ణయం చాటి చెప్పింది. ఈ బడ్జెట్ కేవలం వార్షిక బడ్జెట్ అన్న దృక్పథంతో కాకుండా, వచ్చే నాలుగేళ్ల రాష్ట్ర భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి ప్రణాళికా రచన జరిగింది. ప్రజల అవసరాలు, ప్రాధాన్యతలపై స్పష్టమైన అవగాహనతో ఈ బడ్జెట్ రూపొందించబడింది.

116. సంక్షేమ కార్యక్రమాల నిధులలో ఎక్కడా కోత విధించలేదు. పైగా సంక్షేమ పథకాల లబ్ధిదారులను పెంచే నిర్ణయాలను ప్రభుత్వం ఈ బడ్జెట్ లో ప్రతిపాదిస్తున్నది. దీన్ని బట్టి తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎంతటి నిబద్ధతతో ఉందో ఈ బడ్జెట్ చాటి చెప్పుతున్నది. ఇది పూర్తిగా ప్రజలే కేంద్రంగా రూపొందిన ప్రగతిశీల బడ్జెట్. 2020-21 సంవత్సరానికి గాను రూపొందించిన బడ్జెట్ ప్రతిపాదనలను సభ ఆమోదం కోసం ప్రవేశ పెడుతున్నాను.

**జై హింద్.. ..జై తెలంగాణ**